క్లుప్తంగా

పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న సంఘం నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని పలుగు గడ్డ గ్రామంలో బుధవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ ఆలయానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజేశ్వరి మాట్లాడుతూ.. గ్రామంలో వంద శాతం ముదిరాజ్‌లు ఉండడంతో కులదైవమైన పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఏడాదిలోపే ఆలయాన్ని నిర్మించి ఘనంగా పండగ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఇస్తారి, లింగం, అంజయ్య, రాంచంద్రం, నర్సింలు, కనకయ్య, భిక్షపతి, వెంకటయ్య, కృష్ణ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలకు చెక్


అప్పలాయిచెర్వులో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ

నంగునూరు(సిద్దిపేట): సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలకు చెక్ పెట్టవచ్చని రాజగోపాల్‌పేట ఎస్‌ఐ రాజుగౌడ్ అన్నారు. అప్పలాయిచెర్వులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం ఎస్‌ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్ మల్లవ్వతో పాటు గట్లు శ్రీనివాస్ సహకారంతో ఎనిమిది కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అదే స్ఫూర్తితో దాతల సహకారం తీసుకొని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసేలా సర్పంచ్‌లు చొరవ తీసుకోవాలన్నారు.

వైభవంగా పెద్దమ్మ బోనాలు


బోనాల ఊరేగింపులో భక్తులు

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పెద్దమ్మ బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున బోనాలతో అమ్మవారికి సమర్పించేందుకు తరలివచ్చారు. ఈ ఉత్సవాల్లో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్యే సతీశ్ కుమార్ పాల్గొని బోనమెత్తుకున్నారు. పెద్దమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పాల్గొని పూజలు చేశారు.

కనుల పండువగా నాయకమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు


హోమం నిర్వహిస్తున్న భక్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన నాయకమ్మ ఆలయంలో బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. వేద పండితులు సదాశివశర్మ, సంగీత్‌శర్మల నేతృత్వంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవాహిత దేవతా పూజ, గర్తన్యాసం, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అశ్విని నక్షత్రయుక్త సింహ లగ్న పుష్కరాంశ సుముహూర్తమున నాయకమ్మ దేవతా యంత్ర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, ప్రతిష్ఠ మూర్తుల పూజ, శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఘనంగా రక్తదాతల దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న అధికారులు

సిద్దిపేటజోన్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్‌ఎస్‌వీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలుమార్లు రక్తదానం చేసిన రిజర్వ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డితో పాటు శేఖర్, శ్రీధర్, శ్రీనివాస్‌రెడ్డి, వేణు, షోహెల్, ఖాజా, ప్రశాంత్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రమేశ్, ప్రవీణ్, గణేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో నంబర్ వన్

- బీఆర్‌ఎస్‌ను ప్రజలు మూడోసారి ఆశీర్వదించాలి
- ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి


దుబ్బాకలో గర్భిణులకు న్యూట్రీషన్ కిట్స్ అందిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: వైద్య రంగంలో దేశంలోనే తెలంగాణను నంబర్ వన్‌గా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని బాలాజీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన వైద్యారోగ్య దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంపూర్ణ ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు, మెడిసిన్ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పుట్టబోయే బిడ్డలు పోషకాహారం లోటు లేకుండా ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో కొత్తగా గర్భిణులకు న్యూట్రీషన్ కిట్స్ అందిస్తున్నారన్నారు. కరోనా సమయంలో వైద్య సిబ్బంది చేసిన సేవలు మరువలేనివన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బందికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. తెలంగాణ ప్రజల ఆశీస్సులతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండు సార్లు అధికారంలోకి వచ్చిందని, మూడోసారి ఆశీర్వదించాలని కోరారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని రంగాల్లో తెలంగాణ ఆదర్శంగా తయారు చేసుకుందామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్, తిమ్మాపూర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు ఉన్నారు.

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

హుస్నాబాద్: ఆరోగ్య తెలంగాణే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. వైద్యారోగ్య దినోత్సవ వేడుకలను బుధవారం పట్టణంలోని టీచర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేసిన అనంతరం టీచర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు, వైద్య సిబ్బందికి బీపీకిట్లను పంపిణీ చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే కేసీఆర్ కిట్ సూపర్ హిట్ కాగా, ఇదే స్ఫూర్తితో కేసీఆర్ న్యూట్రీషన్ కిట్లకు రూపకల్పన చేశారన్నారు. మంత్రి హరీశ్‌రావు వైద్యారోగ్యశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారని కొనియాడారు. అనంతర పల్లె దవాఖాన డాక్టర్లకు నియామకపత్రాలు అందజేశారు. సమావేశంలో హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, సిద్దిపేట జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సౌమ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, ఎంపీపీలు లకావత్ మానస, మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ భూక్య మంగ, మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ రజని, కౌన్సిలర్ నళినీదేవి, డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


హుస్నాబాద్: న్యూట్రీషన్ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుడు దీపక్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత వైద్య సేవలు మెరుగయ్యాయన్నారు. పల్లె దవాఖానాలతో పాటు పీహెచ్‌సీ సెంటర్లలో మందులు అందుబాటులో ఉన్నాయని, సిబ్బంది వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో శ్రావణి, పుష్ప, సల్మా, సంతోష్, లలిత, సతీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి


పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

హుస్నాబాద్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి ఫ్లెక్సీని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శంకర్‌బాబు మాట్లాడుతూ.. మాజీ కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పర్యటన సందర్భంగా పట్టణంలోని మారుపాక రాజయ్య విగ్రహం వద్ద బొమ్మ శ్రీరాంచక్రవర్తి పేరుతో బీజేపీ నేతలతో కలిసి ఫ్లెక్సీని ఏర్పాటు చేశామన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫ్లెక్సీని చింపివేయడం బాధాకరమన్నారు. ఫ్లెక్సీని చింపింది బీఆర్‌ఎస్ నాయకులేనని ఆయన ఆరోపించాడు. మళ్లీ ఫ్లెక్సీలు చింపడం పునరావృతమైతే చర్యకు ప్రతి చర్య ఉంటుందని శంకర్‌బాబు హెచ్చరించాడు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, అసెంబ్లీ కో–కన్వీనర్ వేణుగోపాల్‌రావు, కౌన్సిలర్ వేణుయాదవ్, నాయకులు రాంప్రసాద్, తగరం లక్ష్మణ్, కోమటి సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ


హుస్నాబాద్‌రూరల్: పూజలు చేస్తున్న అర్చకులు


వర్గల్(గజ్వేల్): అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలో ప్రతాప్‌రెడ్డి తదితరులు

వర్గల్(గజ్వేల్): మండలంలోని మజీద్‌పల్లి పోచమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. వేదపండిత పరివారం మండప దేవతా పూజలు, హవనం, ప్రాసాధివాసం, గర్త సంస్కారం, బీజన్యాసం, రత్న, ధాతున్యాసాధి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తుల హర్షధ్వానాల మధ్య ఉదయం సుముహూర్త వేళ యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం, అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ లతారమేశ్‌గౌడ్, సర్పంచ్ లతశివరాములు, జెడ్పీటీసీ బాలూయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రతిష్ఠోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పండగ వాతావరణం నెలకొన్నది.

పొట్లపల్లి స్వయంభూ సన్నిధిలో ప్రత్యేక పూజలు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శతరుద్రాభిషేకం, దేవతపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

దుర్గామాత ఆలయ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రం పరిధిలోని చౌడుతండాలో దుర్గామాత ఆలయ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తండావాసులు వారి సంప్రదాయ దుస్తులు ధరించుకొని డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేసుకుంటూ అంగరంగ వైభవంగా కార్యక్రమాన్ని చేపట్టారు. అంతకుముందు మండల కేంద్రంలో జ్యోతిబాపూలే విగ్రహ ఏర్పాటుకు కూడా భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు మంగ, వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజనీతిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు, ఉపాధ్యక్షుడు సత్యంనాయక్, గిరిజన నాయకులు తిరుపతినాయక్, రాజునాయక్, భూక్య సుధాకర్‌నాయక్ తండావాసులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం


బాధితుడి తల్లితండ్రులకు నగదు అందిస్తున్న యువకులు

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని సలాక్‌పూర్ గ్రామానికి చెందిన వగలబోయిన నర్సింహులుగౌడ్ పట్టణ కేంద్రంలో భార్య పిల్లలతో గీత వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తమ కూతురు వివాహం నిశ్చయమైంది. ఈ నెల 14న వివాహం జరగాల్సి ఉండగా పెళ్లి పత్రికలు పంచే క్రమంలో జరిగిన బైక్ ప్రమాదంలో కుమారుడు రక్షిత్(చిన్న) తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్యం అందించాలంటే పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. విషయాన్ని తెలుసుకున్న పట్టణ యువకులు కొందరు తమకు తెలిసిన వాట్సాప్ గ్రూపుల్లో విషయాన్ని పోస్టు చేయడం ద్వారా సుమారు 200 మంది నుంచి రూ.1,76,200లు జమచేశారు. ఈ డబ్బులను పట్టణ యువకులు ఆస్పత్రికి వెళ్లి బాధితుడి తల్లిదండ్రులకు అందించారు.

దశాబ్ది వేడుకలను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ నిర్మల

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలో నిర్వహిస్తున్న దశాబ్ది వేడుకలను విజయవంతం చేయాలని బెజ్జంకి ఎంపీపీ లింగాల నిర్మల సూచించారు. బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ..రాష్ట్ర ఏర్పాటు అనంతరం మండలంలో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. ఈనెల 17న బెజ్జంకిలో నిర్వహించే వేడుకల్లో రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పాల్గొంటున్నందున గ్రామాల నుంచి అధిక సంఖ్యలో అన్ని వర్గాల ప్రజలు తరలి రావాలి కోరారు. ప్రజాప్రతినిదులు, అధికారులు సమన్వయంగా పనిచేసి మండలంలో చేపట్టే పనులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ కనగండ్ల కవిత, తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, ఎంపీడీఓ రాము, ఏఎంసీ చైర్మన్ కచ్చు చంద్రకళ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదలను విస్మరిస్తున్న సీఎం కేసీఆర్

మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి


ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ప్రవీణ్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: నిరుపేదలకు సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేస్తున్నాడని కాంగ్రెస్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి విమర్శించారు. బుధవారం గాంధీనగర్‌లో చేపట్టిన గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎంఎస్‌ఆర్ మనుమడు మేనేని రోహిత్‌రావుతో కలిసి ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ డబుల్ బెడ్రూంలు అరుంధతి నక్షత్రం లాగానే ఉన్నాయని ఎద్దేవా చేశారు. గండిపెల్లి, గౌరవెల్లి ప్రాజెక్టులకు ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పునాదులు వేసి 75 శాతం పనులు చేశారని, ప్రాజెక్టులను పూర్తి చేయకుండా దశాబ్ద కాలం వృథా చేశారన్నారు. రైతులు పంటల పరిహారం అడిగిన, ధాన్యం కొనాలని ఆందోళన చేస్తే రైతులను అరెస్టు చేసి బేడీలు వేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలకు సొంత ఇంటి కళను సాకారం చేస్తామని, గ్యాస్ ధరలు తగ్గిస్తామని ఒకే సారి రూ.2లక్షల రుణ మాఫీ చేస్తామన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో పేదల సంక్షేమ ప్రభుత్వం రావాలంటే అందరూ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు చిత్తారి రవీందర్, ముత్యాల సంజీవరెడ్డి, జంగపెల్లి అయిలయ్య, కౌన్సిలర్స్ శ్రీనివాస్, వల్లపు రాజు, మాజీ సర్పంచ్‌లు బొంగొని శ్రీనివాస్, పోలు సంపత్, దానవేని రమేశ్, పోశవేని శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం


చిన్నకోడూరు: అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు


చేర్యాల(సిద్దిపేట): విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఫకీర్ తదితరులు

చిన్నకోదూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. సిద్దిపేట లయన్స్ క్లబ్ గవర్నర్ రాజేశ్వర్‌రెడ్డి సహకారంతో 200 మంది విద్యార్థులకు పలకలు, పెన్నులు, నోట్‌బుక్స్, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు వనజ మాట్లాడుతూ.. క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. అక్షరాభ్యాసంతోనే చిన్నారుల భవిష్యత్‌కు పునాది ఏర్పడుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అక్షరాలు దిద్దించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అబ్దుల్ షరీఫ్, ఉపాధ్యాయులు రాములు, సురేశ్‌కుమార్, సునీత, దేవకి, వాణితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని రసులాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి ఆధ్వర్యంలో సాముహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలకలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యనమల హరీశ్, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాశగుడిసెలులో..

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కాశగుడిసెలు ప్రాథమిక పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ షేక్ ఫకీర్ ఆధ్వర్యంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కుమారస్వామి, ఉపాధ్యాయుడు రమేశ్, ఉపసర్పంచ్ చాంద్‌బి, వార్డ్ సభ్యులు అక్బర్, నజీరా, ఆదంబి పాల్గొన్నారు.

వేణుగోపాలుడి ఆలయంలో హరేరామ నామ జపం


అఖండ హరినామస్మరణ జపయజ్ఞంలో భక్తులు

వర్గల్(గజ్వేల్): వర్గల్ వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం లోక కల్యాణార్థం మర్కూక్ భవానంద పాండురంగ ఆశ్రమ పరివారం ఆధ్వర్యంలో శతకోటి హరేరామ నామ జప యజ్ఞం ఘనంగా జరిగింది. మొదటగా ఆలయంలో వేదికపై ఆసీనులైన వేణుగోపాలస్వామికి, భవానందస్వామికి ఆలయ అర్చకులు వేదాంతం మురళీధరాచార్యులు పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 6 గంటలకు అఖండ హరేరామ హరేకృష్ణ నామస్మరణ జపయజ్ఞం ప్రారంభించారు. ఈ జప యజ్ఞం సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది.

తెరుచుకోని ఎంవీఐ కార్యాలయం

- ఇబ్బందిపడ్డ వాహనదారులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని జిల్లా అధికారులు


మూసి ఉన్న కార్యాలయం ఎదుట వేచిచూస్తున్న వాహనదారులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో వారానికి రెండురోజులు కొనసాగే రవాణాశాఖ సేవలు బుధవారం కార్యాలయం తెరుచుకోకపోవడంతో నిలిచి పోయాయి. దీంతో పలుసేవల కోసం వచ్చిన వాహనదారులు చేసేదేమి లేక ఇబ్బందితో వెనుదిరిగి వెళ్లిపోయారు. ప్రతి వారంలో బుధ, శనివారం స్థానిక కార్యాలయంలో రవాణా శాఖ సేవలు అందుబాటులో ఉంటాయని సమాచారం ఉన్న సమీప గ్రామాల వాహనదారులు పలు సేవల కోసం కార్యాలయానికి వచ్చారు. ఉదయం 11.30 గంటలైనా కార్యాలయం తెరవకపోవడంతో అక్కడే ఉన్న సెక్యూరిటీని అడగగా ఈ రోజు నుంచి 28వ తేదీవరకు కార్యాలయం పని చేయదని సమాధానం ఇచ్చాడు. వారంలో రెండు రోజులు చేర్యాలకు వచ్చే ఎంవీఐకి పోలీసు అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ డ్యూటీ వేసిన కారణంగా ఆయన కార్యాలయానికి రాలేకపోతున్నాడు. దీంతో ఇక్కడికి పలుసేవల నిమిత్తం వచ్చే వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. చేర్యాలకు వచ్చే ఎంవీఐకి వేరే బాధ్యతలు అప్పగించిన జిల్లా అధికారులు ప్రత్యామ్నాయ మార్గం చూపకపోవడంపై పలు అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో చెప్పా పెట్టకుండా చేర్యాల రవాణా శాఖ కార్యాలయం ఎత్తివేసే ప్రయత్నం చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. సిద్దిపేట జిల్లాలో కలిసిన 4 మండలాలకు సేవలు అందుతాయని చెప్పి కంటితుడుపు చర్యగా కార్యాలయం ఏర్పాటు చేసిన అధికారులు ఇప్పుడు కార్యాలయంలో పనులు నిలిపివేస్తూ వాహనదారులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని, చేర్యాలలో యధావిధిగా కార్యకలాపాలు జరిగేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ తాగునీటి కష్టాలు తీర్చేందుకే భగీరథ

కోహెడరూరల్(హుస్నాబాద్): గ్రామాల్లో తాగునీటి కష్టాలు తీర్చేందుకే సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టారని ఎంపీపీ కొక్కుల కీర్తి అన్నారు. బుధవారం మండలంలోని రామచంద్రాపూర్ గ్రామంలో సర్పంచ్ నోముల పద్మాకొండల్‌రెడ్డితో కలిసి మిషన్ భగీరథ నీటి ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో హుస్నాబాద్ డీఈ శమిన్, పాలకవర్గ సభ్యులు అన్నాడి విజయలక్ష్మి, కొమిరె కవిత, గ్రామ శాఖ అధ్యక్షుడు అన్నాడి రాజిరెడ్డి, కొమిరె తిరుపతి, బినవేణి లక్ష్మణ్, మంతెన బాలయ్య, ముద్దామల్ల శ్రీనివాస్, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

◆ ఆర్థికసాయం

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండలం చెట్ల నర్సంపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుకుంటున్న విద్యార్థి పసుల వినయ్ గత నెల 23న విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. కాగా బుధవారం అతని తల్లిదండ్రులకు సహచర విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు కలిసి కొంత మొత్తం జమచేసి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వేమ జనార్థన్, హెచ్‌ఎం నాగరాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మానస తదితరులు పాల్గొన్నారు.

◆ వార్డు అభివృద్ధే లక్ష్యం

దుబ్బాక: చెల్లాపూర్ 2వ వార్డు అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తామని చెల్లాపూర్ 2వ వార్డు కౌన్సిలర్ గోనేపల్లి దేవలక్ష్మిసంజీవరెడ్డి అన్నారు. బుధవారం చెల్లాపూర్‌లో కమాన్ నుంచి బస్టాండ్ వరకు రూ.95లక్షల 90వేల నిధులతో చేపట్టనున్న బీటీరోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో వార్డును మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వంగ బాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బాలకిషన్ తదితరులున్నారు.

◆ ఘనంగా చెగువేరా జయంతి

దుబ్బాక: దుబ్బాక పట్టణంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చెగువేరా 95వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకుడు నాగరాజ్ చెగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, కొండల్ రెడ్డి, విష్ణు, శ్రీనివాస్, వినిత్ తదితరులున్నారు.

◆ కుంటను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

దుబ్బాకరూరల్: బూరుగు కుంటను కొంత మంది వ్యక్తులు కబ్జా చేశారని మండలంలోని బల్వంతాపూర్ గ్రామస్తులు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఎంపీ స్పందిస్తూ తహసీల్దార్‌కు ఫోన్ ద్వారా తెలిపారు. కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించాడు.

◆ ప్రహరీ పనులు అడ్డగింత

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూరు గ్రామంలో చర్చి పక్కనే గ్రామ పంచాయతీ బోరు చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. బుధవారం సర్పంచ్ జీడికంటి సుదర్శన్ చర్చి కోసం ప్రహరీ నిర్మించేందుకు కదకం తీసి పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ఉపసర్పంచ్, గ్రామస్తులు పనులు అడ్డుకొని గొడవకు దిగారు. ఇదంతా సర్పంచ్ ప్రోద్బలంతోనే బోరు కబ్జా చేసేందుకు కుట్ర చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో నిర్మాణ పనులను సర్పంచ్ నిలివేశారు.

◆ కాల్వపై కప్పు ఏర్పాటుకు నిధులు మంజూరు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని పెద్దచెరువు కట్ట వద్ద రజకులు నిర్మిస్తున్న మడేలయ్య ఆలయం పక్కన ఉన్న మత్తడి నీటి కాల్వపై కప్పు ఏర్పాటుకు రూ.10లక్షలు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ కాపీని బుధవారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఇప్పించారు. ఇట్టి ప్రొసీడింగ్ కాపీ స్థానిక రజక సంఘం నాయకులకు స్థానిక కౌన్సిలర్ నరేందర్, బీఆర్‌ఎస్ నాలుగు మండలాల ఇన్‌చార్జి అంజయ్యలు అందించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు యాదగిరి, శ్రీనివాస్, కనకయ్య, పరశురాములు, అంజయ్య, శ్రీకాంత్, బాలయ్య, చంద్రయ్య, రవి, రాకేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ ఉపసర్పంచ్

చిన్నకోదూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చర్లఅంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, ఉపసర్పంచ్ జెల్ల రవీందర్‌యాదవ్ బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయనకు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పరశురాములు, నాయకులు భూమేశ్‌గౌడ్, నాగరాజు, శివరాంగౌడ్‌లు తదితరులు ఉన్నారు.

◆ ఉత్సవాల పేరుతో ప్రజాధనం వృథా

అక్కన్నపేట(హుస్నాబాద్): ఉత్సవాల పేరుతో అధికారులతో ఈ ప్రభుత్వం ప్రచారం నిర్వహిస్తోందని వైఎస్సార్‌టీపీ హుస్నాబాద్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యలు గాలికొదిలేసి ఉత్సవాల పేరుతో ప్రజాధనం వృథా చేస్తున్నారన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, ప్రభుత్వంపై గ్రామాల్లో తీవ్రస్థాయిలో వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సూరంపల్లి శంకర్, ముదుసు సాయివరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.